ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 4 ఆగస్టు 2025

మెట్ట పంటలకు జీవం

జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు మెట్టపంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. మొన్నటివరకు వానలు లేక ఎండు ముఖంపట్టిన పంటలను చూసి రైతులు ఆందోళన చెందారు. వరుణుడు కరుణించడంతో పంటలకు జీవం వచ్చింది. యాచారం మండలంలోని పత్తి 5,250 ఎకరాలు, వరి 125 ఎకరాలు, టమాట 465 ఎకరాలు, గోంగూర 30 ఎకరాలు, జొన్న 560 ఎకరాలలో సాగు చేశారు.

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి)



యాచారంలో కళకళలాడుతున్న పత్తి చేను

ఇంటింటికీ తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ

» ప్రజల వద్దకు ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు తెల్లవారుజామునే ఇంటింటికీ తిరుగూ పట్టణ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. శనివారం ప్రారంభించిన కాలనీ సందర్శన కార్యక్రమం ఆదివారం కూడ కొనసాగింది. శనివారం మున్సిపాలిటీలోని 6,7,8,9 వార్డులలో పర్యటించారు. ఆదివారం పట్టణంలోని శంకర్‌నగర్, మల్లికార్జున కాలనీ, బీరప్ప కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీలలో పర్యటించారు. ఆయా కాలనీలలో చేపడుతున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలిస్తూ కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు.



శంకర్‌నగర్ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న వీర్లపల్లి

నూతనంగా విస్తరిస్తున్న కాలనీలలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ నీటి సరఫరా కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మిషన్ భగీరథ, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.



శ్రీరాంనగర్‌లో పథకాలను గురించి వివరిస్తున్న రాంచందర్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

» పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మొయినాబాద్/శంకర్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యం అనే నినాదంతో ఇంటింటికీ కేంద్ర పథకాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీరాంనగర్‌లో పర్యటించారు. అలాగే హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ఆరు గ్యారెంటీల హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలన గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు, అంజన్‌కుమార్‌గౌడ్, కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పాపరావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఓబీసీ జిల్లా కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, మదుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పసుపు బోర్డు కల నెరవేరింది..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. శంకర్‌పల్లి మండలంలోని గోపులారంలో నూతనంగా నిర్మించిన శివాజీ విగ్రహాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్‌లతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో భాగంగా వంతెనల నిర్మాణానికి రూ.383కోట్లు, మరుగుదొడ్లకు రూ.31.27కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని గుర్తు చేశారు. అర్హులందరికీ అంత్యోదయ కార్డులను అందజేసి ఉచిత బియ్యాన్ని ఇస్తున్న ఘనత మోదీకే దక్కిందన్నారు. పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.6వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. రెండు దశాబ్దాల పసుపుబోర్డు కలను ప్రధాని మోదీ నెరవేర్చారని గుర్తు చేశారు. రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మహేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్, మండల అధ్యక్షురాలు లీలావతి భయానంద్, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సకల సౌలతులతో!

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు ఇంటిగ్రేటెడ్ భవనాలు

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొంత భవనాల్లేవు. అయితే త్వరలో మంచి రోజులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఇందు కోసం స్థలాలు సేకరించాలని, ఇప్పటికే సొంత భవనాలు ఉంటే వాటిని కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందస్తుగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ జిల్లాలు సిటీకి ఆనుకుని ఉండటం, ఎక్కువగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరగడం, ఎప్పటికప్పుడు పెద్దపెద్ద వెంచర్లు ఏర్పాటు అవుతుండటంతో సర్కార్ ఈ రెండు జిల్లాలపై ప్రత్యేక నజర్ పెట్టింది. ఇక్కడ నుంచి ప్రభుత్వానికి ఆదాయం కూడా అధికంగా వస్తుండటంతో వీటి భవనాల నిర్మాణానికి తొలి ప్రాధాన్యమిస్తుంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



చేవెళ్ల రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం కేటాయించిన భూమి

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై స్పెషల్ ఫోకస్
- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాల నిర్మాణం
- తొలి విడతలో ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో
- 4-5 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు ఒకే చోట నిర్మాణం
- త్వరలో గచ్చిబౌలిలో శంకుస్థాపనకు ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మరో ముందడుగు వేసింది. ప్రజలకు మరింత సమర్థవంతం, పారదర్శకంగా సేవలను అందించేందుకు వీలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడం (రీఆర్గనైజేషన్)తో పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. రెవెన్యూ, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన రివ్యూలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్‌ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

మిగతా 8వ పేజీలో...

ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. సిటీకి ఆనుకుని ఉండటం, ఎక్కువగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరగడం, ఎప్పటికప్పుడు పెద్దపెద్ద వెంచర్లు ఏర్పాటు అవుతుండటంతో సర్కార్ ఈ రెండు జిల్లాలపై ప్రత్యేక నజర్ పెట్టింది. రంగారెడ్డి జిల్లాలోని 18, మేడ్చల్ జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక హంగులతో కార్పొరేట్ తరహాలో నిర్మించేందుకు ప్లాన్ చేసింది. స్థల పరిశీలన చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సైతం ఆదేశాలు అందాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ముందంజలో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 14 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలోని 12 కార్యాలయాలకు మూడు చోట్ల ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించారు.

కంకర రోడ్డుపై ప్రయాణికుల పాట్లు



అధ్వానంగా ఆదిభట్ల-నాదర్‌గుల్ రోడ్డు

ఆదిభట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని రోడ్డు గుంతలు పడి, కంకర లేలడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అడుగుకో గుంత ఉండటంతో ప్రయాణమంటేనే జంకుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్‌లోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి నాదర్‌గుల్ వరకు 2014లో జడ్పీ నిధులతో నిర్మించిన రోడ్డు నేడు దెబ్బతింది. అడుగుకో గుంత ఏర్పడింది. రోడ్డును బాగు చేయాలని అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని అతిథి గృహం



- పదేళ్ల క్రితమే నిర్మాణం పూర్తి
- దుమ్ము, ధూళితో దర్శనం
- పక్షులకు ఆవాసం

8

ఘనంగా స్నేహితుల దినోత్సవం

బ్యాండ్స్ కట్టుకున్న ఫ్రెండ్స్ ● పలుచోట్ల కేక్‌లు కట్ చేసి సంబురాలు



కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

ఆమనగల్లు /కడ్తాల్ , ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం అట్టహాసంగా జరుపుకున్నారు. స్నేహితులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేద, ధనిక చూడనిది, కులమత భేదం లేనిది, బంధుత్వం కన్న గొప్పది స్నేహం ఒక్కటేనని చాటుతూ కేక్‌లు కట్ చేసి ఫ్రెండ్స్ పంచిపెట్టుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థం లేని స్నేహం కలకాలం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం కేశవులు, రాజేశ్ రెడ్డి, నర్సింహా, జగన్ గౌడ్, రమేశ్ గౌడ్, యాదయ్య, వినోద్, కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు జహంగీర్‌బాబా, సత్యం, రాజేశ్, రాజేందర్, బుచ్చయ్య, జగన్, యాదయ్య, అస్గర్ అలీ, ప్రవీణ్, షాబోద్దీన్, రమేశ్, శ్రీను, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికులకు అండగా..

సఫాయి సురక్ష పథకం అమలు

» సంక్షేమం, ఆరోగ్య పరిస్థితులపై వివరాల సేకరణ
» మెడికల్ కిట్ల పంపిణీ, వైద్యశిబిరాల ఏర్పాటు

చేవెళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను, కాలువల్లో మురుగును తొలగిస్తూ పారిశుధ్య కార్మికులు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో వారి ఆరోగ్య, సంక్షేమం కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల కోసం స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా సఫాయి సురక్ష పథకం అమలు చేసేందుకు

మిగతా 8వ పేజీలో...

కార్మికులకు అవగాహన కల్పిస్తాం



మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సఫాయి సురక్ష పథకాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం. వారి ఆరోగ్య వివరాలతో పాటు వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. కార్మికులందరికీ ఆరోగ్య పరిరక్షణ కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశం, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్

కవిత దీక్షకు బీసీలు భారీగా తరలిరావాలి

మహేశ్వరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ బిల్లు సాధన కోసం ఎమ్మెల్సీ కవిత తలపెట్టిన 72 గంటల దీక్షకు భారీగా తరలిరావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, జాగృతి నాయకుడు పల్నాటి నరేష్ నేత పిలుపునిచ్చారు. ఈనెల 4, 5, 6వ తేదీన నిర్వహించే దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మహేశ్వరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త బీసీ సమాజం కవితకు అండగా నిలబడాలన్నారు. అలాగే దీక్షలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు మద్దతు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, రవి, శ్రీకాంత్, రవినాయక్, సాయియాదవ్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరేష్

బీసీల హక్కుల కోసం 42 శాతం రిజర్వేషన్ సాధిద్దాం

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

చేవెళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీల హక్కుల కోసం 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్ల మండలంలోని బీసీ సంక్షేమ సంఘం నాయకులు హైదరాబాద్ నగరంలో ఉన్న ఆర్. కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆయన ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా కమ్మెట గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్‌లను ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో బీసీ నాయకుల ప్రాధాన్యత ఉండాలని సూచించారు. బీసీ సమాజ అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య, శంకర్‌పల్లి మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్ ఉన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న బీసీ నాయకులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


ఆర్వో అర్షద్‌ను శాలువాతో సన్మానిస్తున్న కమిషనర్ జ్యోతి

శామీర్‌పేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధుల్లో అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తూంకుంటమున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. మునిసిపాలిటీ ఆర్వో అర్షద్ అహ్మద్ జల్‌పల్లి మున్సిపాలి టీకి బదిలీ అయ్యారు. ఆదివారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు సన్మానాన్ని నిర్వహించారు. అర్షద్ అహ్మద్‌ను కమిషనర్, మేనేజర్ శ్రావన్‌కుమార్, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని, నిజాయితీగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తే మనం ఎక్కడున్నా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. తూంకుంటలోని డబుల్ బెడ్ రూమ్‌లకు ఇంటి నంబర్లను కేటాయించడంతో అర్షద్ అహ్మద్ ముఖ్య పాత్ర పోషించారని, తక్కువ సమయంలో ఎక్కువ ఇంటి నంబర్లను కేటాయించిన ఘనత తూంకుంట మున్సిపాలిటీకే దక్కిందన్నారు. అనంతరం ఆర్వో అర్షద్ అహ్మద్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన సమయంలో సహకరించిన అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లకుధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జికి పడిన రంధ్రం పూడ్చివేత


కాగ్నా నది బ్రిడ్జిపై మరమ్మతులు చేసి సీసీతో పూడ్చిన రంధ్రం

తాండూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డు మార్గం కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. జులై 27న పెద్ద రంధ్రం పడి రాజకీయ రాద్ధాంతం జరిగిన విషయం తెలిసిందే. పూర్తయిన పనులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. తాండూరు నుంచి కొడంగల్, మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట్, కర్నాటక రాష్ట్రం గుర్మిట్కల్, యాద్గిర్, కృష్ణా ప్రాంతాల వాసులు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జి నాణ్యతపై మరోసారి పూర్తి స్థాయిలో ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలన జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించని అంశంలో బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

మొయినాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబీకులు పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లును దోచేశారు.ఈ ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధి పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సీహెచ్.అనిత, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో బంధువుల పెళ్లికి వెళ్లారు. ఆదివారం ఇంటికొచ్చారు. కాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందరవందర చేశారు. దొంగలు బీరువా తాళం పగులగొట్టి అందులో దాచిన రెండు బంగారు నెక్లెస్‌లు, రెండు జతల కమ్మలు, రెండు బ్రాస్‌లైట్లు, నాలుగు గాజులు మొత్తం సుమారు 16తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారని బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముదిరాజ్ గ్రామ కమిటీల ఎన్నిక


లేమూరు ముదిరాజ్ కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న పాండు

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): లేమూరు, అగర్‌మియాగూడ, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, ఉట్లపల్లి, కటికపల్లి గ్రామాల ముదిరాజ్ కమిటీలను ఎన్నుకున్నట్లు సంఘం మండలాధ్యక్షుడు పిట్టల పాండు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల అనంతరం మాట్లాడారు. లేమూరు గ్రామ అధ్యక్షుడిగా డిల్లీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ఎన్నుకున్నట్లు తెలిపారు.అగర్‌మియాగూడ అధ్యక్షుడిగా నీరటి పాండు, ఉపాధ్యక్షులుగా గిరి, సాయిరెడ్డిగూడ అధ్యక్షుడు గొర్రెంకల నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎం.పాండు, దాసర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మీగడ శేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఉట్లపల్లి గ్రామ అధ్యక్షుడు కె.సత్తయ్య, కటికపల్లి అధ్యక్షుడిగా నూకం సురేందర్, యూత్ అధ్యక్షుడిగా ఎ.రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎడ్ల బాబురావు, జయేందర్, బి.అంజయ్య, పి.లింగం, శ్రీధర్, మధు, వి.సుదర్శన్, వెంకటేష్, సత్యం, మహేందర్, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని రాగి జావ

- పాఠశాలలు ప్రారంభమై నెలలైనా అమలు చేయని ప్రభుత్వం
- అర్ధాకలితో విద్యార్థుల బాధలు

కులకచర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయడం లేదు. ఉదయం పూట విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకూడదని స్కూళ్లలో వారంలో మూడు రోజులు రాగి జావ పంపిణీకి గతంలో ప్రభుత్వం నిర్ణయించి రెండేళ్లపాటు అందజేసింది. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతో స్కూళ్లలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైనా ఇప్పటి వరకు విద్యార్థులకు రాగి జావ ఇవ్వడం లేదు. దీని అమలుపై జిల్లా, మండల స్థాయి అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఇంకా ఆదేశాలు జారీ చేయలేదు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మధ్యాహ్న భోజనం వరకు ఆకలితోనే..

ఉదయం పూట పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో వస్తారని, అలాగే తల్లిదండ్రులకు ఉదయం టిఫిన్‌చేసే ఇబ్బందులు తప్పించాలని ప్రభుత్వం ఉదయం పాఠశాలల్లో రాగి జావ అందజేసే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కో విద్యార్థికి గ్లాసెడు రాగి జావ అందజేసేందుకు రూ.3 చొప్పున నిర్వాహకులకు చెల్లించింది. ఉదయం రాగి జావ తాగితే విద్యార్థులకు బ్రేక్‌ఫాస్టులా పనిచేసేది. బెల్లంతో కలిపి ఇచ్చే రాగి జావతో బాలికల్లో రక్తహీనత నివారణకు ఉపయోగపడేది. ఇప్పుడు జావ ఇవ్వక ఉదయం ఇంటి వద్ద తినకుండా వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో అలమటిస్తున్నారు. నిబంధనల మేరకు ఓ సంస్థ వారు 2023-2024 నుంచి పాఠశాలలకు బెల్లం కలిపిన రాగిజావ పొడిని సరఫరా చేసేవారు. దానిని వేడి నీటిలో కలిపి విద్యార్థులకిచ్చేవారు. ఇలా 2024-2025 విద్యా సంవత్సరం చివరి వరకు అందజేశారు. ఈ సారి ఇంకా జావ పంపిణీ ప్రారంభించలేదు. పాఠశాలల్లో రాగి జావ పొడి అయిపోయిందని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే తెలియజేశారు. అయితే మళ్లా ఆర్డర్ చేసి తెప్పించేందుకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు రాలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాలల్లో వెంటనే రాగి జావ పంపిణీని ప్రారంభించేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న 1,029 ప్రభుత్వ పాఠశాలల్లో 75,952 మంది వరకు విద్యార్థులున్నారు.




విద్యార్థులకు రాగి జావ పంపిణీ(ఫైల్)

రాగి జావ ఆరోగ్యానికి ఎంతో మేలు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్యపరంగా రాగి జావ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఉదయం విద్యార్థులకు పౌష్టికత్వంతో కూడిన రాగి జావ అందించగా విద్యార్థులంతా ఉత్సాహంగా తాగేవారు. అలాగే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కూడా రాగి జావ పంపిణీ దోహదం చేసింది. వెంటనే స్కూళ్లలో రాగి జావ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రాఘవేందర్‌రెడ్డి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, కులకచర్ల



పెట్రోల్ పంపును ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎనుముల కొండల్‌రెడ్డి

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి పథకాలను ఎంచుకోవడం శుభపరిణామమని, వాటితో ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణ పరిధి హెచ్‌పీ పెట్రోల్ పంపును ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కె.చంద్రమోహన్, నాయకులు దేవ్లానాయక్, ప్రకాశ్, చంద్రమౌళి, వెంకటరెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మైపాల్, రఘునందన్‌రెడ్డి, కాంతిరెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రశాంత్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్ అన్నారు. ఈ నెల 10న సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిరవహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆదివారం మహేశ్వరంలో సంఘం మండల అధ్యక్షుడు నిమ్మగూడెం సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామారావుగౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతానికి రాజకీయాలతో సంబంధం లేకుండా గౌడ సంఘం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేశ్‌గౌడ్, రాజేష్‌గౌడ్, మశ్చేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాపిరాజ్‌గౌడ్, వరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సూర్యగిరి ఎల్లమ్మ బోనాలకు తరలిరావాలి

మహేశ్వరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):తుక్కుగూడ మునిసిపాలిటీలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా భక్తులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. 11, 12 తేదీల్లో జరిగే ఎల్లమ్మ బోనాల వాల్ పోస్టర్‌ను ఆదివారం జిల్లెలగూడలోని తన క్యాంప్ కార్యాలయంలో సబితారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రత్నం తదితరులు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఎల్లమ్మ ఆలయానికి ఘన చరిత్ర ఉందని, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. ఆలయానికొచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేలా ఆలయ కమిటీ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, సుమన్, సురేశ్, నాగేష్‌గౌడ్, బుచ్చిరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఎండుతున్న పైర్లు

- వారం రోజులుగా పని చేయని ట్రాన్స్‌ఫార్మర్
- వరి నారు, దుక్కులకు అందని నీరు

షాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని కేశవగూడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడైందని వారం రోజుల కింద అధికారులకు తెలిపినా బాగు చేయించడంలేదన్నారు. పదెకరాల్లో వరి నారుకు, దుక్కికి నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏతకొచ్చిన వరి నారు, అలాగే నాటేసేందుకు దున్నిన దుక్కి కూడా ఎండుతోందని రైతులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరిస్తానన్న డీఈఈ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడమో లేదా పాతదే బాగుచేయించడమో చేయాలని కేశవగూడ రైతులు కోరుతున్నారు.



ఎండుతున్న వరి నారును చూపుతున్న రైతు

ఈ అవస్థలెన్నాళ్లు?

- ఇళ్లలోకి చేరుతున్న వాగు నీరు
- ఇందూరులో ఏళ్లుగా ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులు
- మరో కల్వర్టు నిర్మాణమే సమస్యకు పరిష్కారం



ఇళ్ల పక్కనుంచి పారుతున్న వాగు



ఎస్సీ కాలనీలో ఇంట్లోకి చేరిన నీరు(ఫైల్)

పెద్దేముల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆ కాలనీ వాసులను వర్షాకాలం కష్టాలు చుట్టుముడుతున్నాయి. కాస్త పెద్దవాన కురిస్తే సమీప వాగు పొంగి నీరు ఇళ్లలోకి వస్తోంది. వర్షం పడిన సమయాల్లో రాత్రిళ్లు వారికి నిద్ర కరువవుతోంది. వంట సామగ్రి తడవకుండా ఉండేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పక్కనున్న వాగుతో తాము ఈ అవస్థలు ఎన్నాళ్లు భరించాలని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దేముల్ మండలం ఇందూరులో ఊరి చివర వాగు పారుతోంది. దానిలో వరద సాఫీగా వెళ్లే వీలులేక నీరు వెనక్కి తన్ని పక్కనున్న ఇళ్లను ముంచెత్తుతోంది. గ్రామస్థులు సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా చిన్నపాటి కల్వర్టును నిర్మించారు. అయితే అధికారులు ఇక్కడే తప్పు చేశారు. కాలువపై ఎత్తు పెంచి ఒక్క కల్వర్టే నిర్మించారు. మరో కల్వర్టును నిర్మించి ఉంటే నీరు సాఫీగా వెళ్లేది. ఇప్పుడు వరద ఇళ్లలోకి చేరి వస్తువులన్నీ తడిసిపోతున్నాయి. ప్రస్తుత కల్వర్టు పక్కన మరో కల్వర్టు కట్టాలని గ్రామస్థులు కోరుతున్నా, ఆందోళనలు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జూలై 22 అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఇందూరు వాగులో వరదనీరు ప్రవహించి సమీప ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వంటసామగ్రి, బియ్యం ఇతర వస్తువులను మంచాలు, అటకల మీదికి ఎక్కించారు. అయినా కొందరి ఇళ్లలో వస్తువులు తడిసిపోయాయి.

ఒకే కల్వర్టుతో నీరు సాఫీగా వెళ్లడం లేదు



వర్షాకాలంలో మేము నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వాగుపై ఒకే కల్వర్టు నిర్మించడంతో వరదనీరు సాఫీగా వెల్లడం లేదు. భారీ వర్షాలొస్తే వరద పెరిగి మా ఇండ్లలోకి నీరొస్తోంది. కొన్నిసార్లు పాములు కూడా వస్తున్నాయి. దీంతో మేం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. పాలకులు అదనపు కల్వర్టు నిర్మిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

- కందనెల్లి మొగులప్ప, ఇందూరు

తిండి గింజలు నీటి పాలవుతున్నాయి



కూలి చేసి సంపాదించుకున్న తిండి గింజలు వరదపాలవుతున్నాయి. పెద్ద వర్షం వస్తే మాకు నిద్ర ఉండదు. వంట సామాగ్రంతా మంచాలపై, అటకపై పెడుతున్నాం. వరదలో పాములు కూడా కొట్టుకొస్తున్నాయి. చీకట్లో ఏ పాము కరుస్తుందోనని జంకుతున్నాం. అధికారులు, పాలకులు వరదనీరు ఇండ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

- కుంటల లింగప్ప, ఇందూరు

ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతులు కావాలా?

- ప్రభుత్వం ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి
- వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ బండారి రమేశ్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మనుషుల్లో దైవ భక్తి, దేశ భక్తి, సామాజిక బాధ్యత, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ సన్మార్గంవైపు నడిపిస్తున్న ధార్మిక కార్యక్రమాలను ప్రపంచ దేశాలన్నీ ఆచరిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విశ్వహిందూ పరిషత్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సేవా ప్రముఖ్ బండారి రమేశ్ ఆదివారం పేర్కొన్నారు. అర్చకులు, పండితులు, పురోహితులు దేశ విదేశాల్లో ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుండడం వల్ల యువత ఆధ్యాత్మికత వైపు పయణిస్తోందని తెలిపారు. ధార్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ధార్మికతతో సంస్కృతీ సంప్రదాయాలు పరిరక్షించబడతాయని, యువత సన్మార్గంలో నడుస్తుందని తెలిపారు. అనుమతి లేకుండా ఆలయ పూజారులు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించొద్దంటూ ఎండోమెంట్ శాఖ ఉత్తర్వులు జారీచేయడం సరికాదన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై గణేష్ నవరాత్రులు, శ్రీరామ నవమి, బ్రహ్మోత్సవాలు, జాతరలు వంటి సామాజిక కార్యక్రమాలకూ అనుమతి తీసుకోవాలా? అని ఆ ప్రకటనలో రమేశ్ ప్రశ్నించారు. ఆలయ పూజారులను కట్టడిచేసే ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



చౌదర్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాజ్యాధికారం కోసం బీసీలు ఉద్యమించాలి

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బీసీలు ఉద్యమించాలని, రాజ్యాధికారం లేకపోవడంతో బీసీలు తరతరాలుగా అన్యాయాలకు గురవుతున్నారని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రచారకార్యదర్శి కె.నరహరిచారి అన్నారు. ఆదివారం యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లోనూ 42శాతం విధిగా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దసరా పండగ వరకల్లా రాష్ట్రంలో 200 మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు. ఉద్యమంలో మహిళలకు కూడా కీలక బాధ్యతలు అప్పగించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగార్జున, శ్రీనివాస్, శ్రీశైలం, బిక్షపతి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి



పూజలో పాల్గొన్న జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోందని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వ రంగంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందన్నారు. చందన్‌వెల్లిలోని పారిశ్రామికవాడలో నిలోఫర్ బాబూరావు ఏర్పాటు చేసిన నూతన నిలోఫర్ టీ పౌడర్ ప్యాకింగ్ ఫ్యాక్టరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్లతో కలిసి విజయలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు ఇలాంటి ప్రైవేట్ పరిశ్రమలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అన్ని ప్రోత్సాహకాలను కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌రెడ్డి, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, లింగం, సుభాష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ

- తీరునున్న ఇక్కట్లు



పింఛన్‌దారుడి ఐరిస్ తీసుకుంటున్న పోస్ట్‌మ్యాన్

కులకచర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చేయూత, ఆసరా పింఛన్‌ల లబ్ధిదారులకు ముఖ గుర్తింపు విధానంతో డబ్బు అందిస్తున్నారు. ఇప్పటి వరకు వరకు వేలి ముద్రలు పడని వృద్ధులు, అందులకు, దివ్యాంగులకు పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో పోస్టుమెన్ పింఛన్‌లు ఇచ్చేవారు. ఈ విధానంతో అక్కడక్కడ లోపాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) విధానాన్ని అమలు చేస్తోంది. ఐరిస్ స్కాన్ చేసి పోస్టుమెన్ పింఛన్ ఇవ్వాలని, పింఛన్ల పంపిణీ ఇకపై పంచాయతీ కార్యదర్శులు చేయాల్సిన అవసరం లేకుండా నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సిస్టం ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చింది. పోస్టాఫీసుకు వెళ్లే పింఛన్‌దారులు యాప్ ద్వారా ముఖ గుర్తింపు నిర్ధారించుకొని పింఛన్ ఇస్తారు. ఫేస్‌స్కాన్‌తో బోగస్ లబ్ధిదారులకు సైతం చెక్‌పెట్టొచ్చని, అలాగే వేలి ముద్రల పడని వారి ఇబ్బందులు తీర్చేందుకని ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే పోస్టాఫీసుకు వెళ్లలేని వారికి గ్రామాల్లోనే ఫేషియల్ రికగ్నిషన్‌తో పెన్షన్ అందజేస్తారు. కాగా కులకచర్ల సబ్ పోస్టాఫీస్ పరిధిలో 7వేలకుపైగా సామాజిక పింఛన్‌దారులు ఉన్నారని ఎస్పీఎం రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వారికి ప్రతీ నెల 14 మంది పోస్టుమెన్ ద్వారా పింఛన్లను అందజేస్తామని ఆయన తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై

చౌదరిగూడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం శ్రీరంగాపూర్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలను ఆయన పరిశీలించారు. గ్రామానికి చెందిన తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాదిక్ సొంత డబ్బుతో గ్రామంలో సోలార్ విద్యుత్‌తో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత పదేళ్లుగా గ్రామంలోని పలు సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న సయ్యద్ సాదిక్‌కు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

అమ్మవార్లకు ఘనంగా బోనాలు



ధర్మన్నగూడలో బోనాలతో మహిళలు

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మన్నగూడ, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివసత్తులు శిగమూగారు. ఆలయాల వద్ద మహిళలు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఠాయిపల్లిలో బీరప్ప, మహంకాళి బోనాలు

ఆమనగల్లు: మున్సిపాలిటీలో పరిధి విఠాయిపల్లిలో బీరప్ప, మహంకాళి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ సర్పంచ్ సాలయ్య, నాయకులు శంకర్, గణేశ్, వెంకటేశ్, నర్సింహ, మల్లయ్య, మహేశ్, ఆంజనేయులు, శ్రీశైలం, శివ, పాపయ్య, జంగమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఘట్‌కేసర్‌లో పండుగ సందడి

ఘట్‌కేసర్: బోనాల పండుగను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఘట్‌కేసర్‌లో బోనాల పోచమ్మ, మహంకాళి, మైసమ్మ ఆలయాలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. రాత్రి ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు.



బోనంతో వెళ్తున్న ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.పావని



నారపల్లిలో కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

వినాయక మండపం నిర్మాణానికి భూమిపూజ

ఆదిభట్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చింతపల్లిగూడ (3వార్డు)లో వినాయక మండపం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. మండ పం నిర్మాణానికి తెలంగాణ పారా మెడిక్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ హాజరై భూమిపూజ చేశారు. రూ.3లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణానికి దాతలు సహకరించాలని కో రారు. జోగు శేఖర్, సంజీవ, గణేష్, నరసింహ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న అశోక్

ప్రారంభానికి నోచని అతిథి గృహం

- పదేళ్ల క్రితమే నిర్మాణం పూర్తి
- దుమ్ము, ధూళితో దర్శనం
- పిచ్చుక గూళ్లకు ఆవాసం..


పదేళ్లక్రితం నిర్మించిన గెస్ట్‌హౌజ్


భవనం లోపల చెత్తా చెదారం

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదేళ్లక్రితం అధికారులు విశ్రాంతి తీసుకునేందుకు ఆనాటి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రూ.40లక్షల నిధులతో అతిథి గృహం నిర్మించారు. ముందు కిటికీలు పెట్టి ఆ తరువాత ఏడాదికి వాటిని తొలగించి ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే, గ్రిల్స్‌కు గ్లాసులు లేకపోవడంతో పిచ్చుకలు లోనికి వెళ్లి గూళ్లు కట్టాయి. భవనం అంతా దుమ్ము, ధూళితో పాటు చెత్తచెదారంతో నిండిపోయింది. పనులు నాసిరకంగా చేయడంతో కడప దెబ్బతింది. తాగునీటి వసతి కూడా కల్పించలేదు. నీటి వసతి కల్పించడానికి పైప్‌లు బిగించలేదు. విద్యుత్ వసతి కూడా సక్రమంగా ఏర్పాటు చేయలేకపోయారు. అతిథి గృహం బయట లైట్లు వేసేచోట ఆన్, ఆఫ్ స్విచ్‌లు పాడైపోయాయి. ఇందులో ఏర్పాచే చేసిన సోఫా నేడు కనిపించడం లేదు. భవనం ఎదుట అధికారులు, ప్రజాప్రతినిధుల వాహనాలు మాత్రమే పార్క్ చేస్తున్నారు. పూలమొక్కలు పెంచడానికి మట్టిని తీసుకొచ్చి చేతులు దులుపుకున్నారు. త్వరగా పనులు పూర్తిచేసి అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవడంలో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారుల అలసత్వమే కారణమని స్థానికులు ఈ సందర్భంగా ఆరోపిస్తున్నారు.


అతిథి గృహంలో పిచ్చుక గూడు

పారిశుధ్య కార్మికులకు అండగా..

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఇందుకోసం పారిశుధ్య కార్మికుల ఆరోగ్య వివరాలను అందజేయాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. వాటిని సేకరించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

చేవెళ్ల డివిజన్‌లో 283 మంది..

చేవెళ్ల డివిజన్ పరిధిలో మొత్తం మూడు మున్సిపాలిటీలు ఉండగా, మొత్తం 283 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో చేవెళ్ల మున్సిపాలిటీలో 90 మంది, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 47, మొయినాబాద్ మున్సిపాలిటీలో 146 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. సఫాయి సురక్ష పథకం అమలుకు వీరందరి పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. అలాగే కార్మికులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా వర్తింపచేసేలా శానిటేషన్ విభాగం అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో పారిశుధ్య కార్మికులకు వేతనాలను కాంట్రాక్ట్ సంస్థలకు సంబంధించిన ఏజెన్సీలు ఇచ్చేవి. అయితే కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాల్లో జమ చేస్తున్నారా..? లేదా అని ఆరా తీసి, ఏమైనా అవకతవకలుంటే అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఆరోగ్య పరిరక్షణ కిట్లు..

మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గతంలో ఏటా ఆరోగ్య పరిరక్షణ కిట్లు అందజేసేవారు. అయితే ఇటీవల అవి సక్రమంగా అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే సఫాయి సురక్ష పథకం ద్వారా కార్మికులందరికీ కచ్చితంగా ఆరోగ్య పరిక్షణ కిట్లలో ఉండే చేతి గ్లౌజులు, కాళ్లకు పొడుగు బూట్లు, తలకు హెల్మెంట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికులకు అవగాహన కార్యక్రమాలు, వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం


ఉత్సవ విగ్రహ ఊరేగింపులో నిర్వాహకులు, నాయకులు

కడ్తాల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాలు కొనసాగే వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. ఎక్వాయిపల్లితో పాటు సమీప గ్రామ ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలిరోజు అమ్మవారి ఉత్సవ విగ్ర హ ఊరేగింపు, గణపతిహో మం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు జరిగే విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేసినట్లు ని ర్వాహకులు చెప్పారు. నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు జోగు వీరయ్య, పాలకుర్ల కరుణాకర్, జంగం సాయిలు, యాదయ్య, సుమన్, శంకర్, మధు, శ్రీను, రాఘవేందర్, కిష్టయ్య, ముత్యాలు, సత్తయ్య, వెంకటేశ్, చందు, జంగయ్య, రాజు, లక్ష్మణ్, శంకర్, రమేశ్, విష్ణు, శ్రీశైలం, వంశీ, వెంకటేశ్, ప్రభాకర్, నర్సింహ, విగ్రహదాత కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం


ఎస్సై శ్రీకాంత్‌కు నగదు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ నాయకులు వజ్రం రూ.10 వేలు, మాణిక్‌రెడ్డి రూ.10 వేలు ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఎస్ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వజ్రం, మాణిక్ రెడ్డిలను పోలీసులు అభినందించారు. ప్రతీఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణురెడ్డి, మట్ట అంజయ్య, పవన్ వాల్మీకి, సురేందర్ గౌడ్, శివగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సకల సౌలతులతో..!

(ఐదో పేజీ తరువాయి)


అద్దె భవనంలో కొనసాగుతున్న చేవెళ్ల రిజిస్ట్రార్ ఆఫీస్

ఉండగా వాటిలో కేవలం 37 ఆఫీసులకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తొలి విడతలో ఔటర్ పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను ఒకేచోట నిర్మించాలని నిర్ణయించారు. రంగారెడ్డి జిల్లాలో 14 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలోని 12 కార్యాలయాలకు మూడు చోట్ల ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించాలని నిర్ణయించారు. మొదటగా గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో నిర్మించనున్నారు. ఈమేరకు ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాలకు అవసరమైన భూమిని గుర్తిస్తున్నారు. అదేవిధంగా నిర్మాణాలకు సంబంధించి నమూనాలను రూపొందిస్తున్నారు. కేఫెటేరియాలు, వెయిటింగ్ లాంజ్‌లు ఇతర హంగులతో కార్పొరేట్ ఆఫీసుల తరహాలో ఈ బిల్డింగ్‌లు నిర్మించాలని భావిస్తోంది. అయితే, ఇందులో భాగంగా ఆదాయం వచ్చే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తొలి విడతలో నిర్మించనున్నారు.

రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు ఉన్నాయి. వీటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. రంగారెడ్డి రిజిస్ట్రార్ పరిధిలో 22 సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో జిల్లా సబ్‌రిస్ట్రేషన్ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. డిస్ట్రిక్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని మొత్తం 22 కార్యాలయాలు ఉన్నాయి. అందులో రంగారెడ్డి జిల్లాలో 18, వికారాబాద్ జిల్లాలో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ మినహా మిగతావి అన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సీజన్లలో కార్యాలయాలు కిక్కిరిసిపోతున్నాయి. పనుల నిమిత్తం వచ్చేవారు కూర్చునేందుకు వీలు లేకుండా ఉండటంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట సర్దుకుపోతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేవరకు కార్యాలయంలో నిలబడే ఉండాల్సి వస్తుంది. ఇకపై ఇలాంటి పరిస్థితి కనిపించకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పక్కా భవనాలను నిర్మించేందుకు తెలంగాణ సర్కార్ సంకల్పించింది. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు.. ఇంటిగ్రేటెడ్ భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. మొదటి దశలో ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో పరిధిలోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొదటగా గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో నిర్మించనున్నారు.

అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే..

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిత్యం లక్షల్లో ఆదాయం వస్తున్నా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తిప్పలు పడుతున్నారు. జిల్లా కలెక్టరేట్, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మాసిటీ, వంటి ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు అవుతుండటంతో ఇక్కడ భూములకు మంచి డిమాండ్ ఉంది. అద్దె భవనంలో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కోర్టు పక్కన అనుకుని ఉన్న స్థలాన్ని కేటాయించారు. పదేళ్ల క్రితం రూ. 62 లక్షలు మంజూరు చేశారు. పక్కా భవనం నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాక పోవడంతో నిధులు వెనక్కు పోయాయి. ప్రస్తుతం అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన అద్దె భవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. క్రయ విక్రయాలు జరిపేందుకు వచ్చిన వారికి కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాంతో పక్కా భవన నిర్మాణ కోసం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం 2019లో ప్రభుత్వం 10 గుంటల భూమిని కేటాయించింది. ఆమేరకు దీనికి అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ శంకుస్థాపన చేశారు. కానీ, నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ప్రస్తుతం ఈ స్థలం సమీపంలో ఉన్న ఫంక్షన్‌హాల్‌కు పార్కింగ్ స్థలంగా మారింది. శంకర్‌పల్లి, గండిపేట్, ఫరూక్‌నగర్, చంపాపేట్, పెద్ద అంబర్‌పేట్, వనస్థలిపురం, సరూర్‌నగర్, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, వికారాబాద్, పరిగి, తాండూరులో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే అవస్థల నడుమ కొనసాగుతున్నాయి.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత


పెళ్లి కానుక అందజేస్తున్న దశరథ్ నాయక్

కడ్తాల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డ వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కానుగుబావి తండాకు చెందిన నేనావత్ దేవికిషన్ దంపతుల కుమార్తె మీనాక్షి వివాహం సందర్భంగా దశర థ్ నాయక్ రూ.21 వేలు, పట్టుచీరను ఆదివారం అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5వేలు, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్ రూ.5వేలు, మాజీ ఉప సర్పంచ్ శారదపాండు రూ.25 వేలు, శ్రీను రూ.10 వేలు, లక్ష్మణ్ రూ.10 వేలు, శ్రీను రూ.5వేలు ఆర్థిక సా యం అందజేశారు. టాక్‌రాజ్ గూడ తండాకు చెందిన వడ్త్యావత్ అనిత దేవులా కుమార్తె నిహారిక వివాహానికి ట్రస్ట్ ద్వారా రూ.21 వేలు, పట్టు చీ రను దశరథ్ నాయక్, కోట్యా రూ.10 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, సాయిలు, రమేశ్, చంద్రమౌళి, రామకృష్ణ, జగన్, రా ములు నాయక్,ధర్మ, కృష్ణయ్య, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, చందు, పాండు, రాజు, శ్రీకాంత్, మహేశ్, చందర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం


కడ్తాల : కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణలతో కలిసి జైపాల్ యాదవ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. స్నేహం కంటే గొప్పదేమి లేదని ఆయన పేర్కొన్నారు. నాయకులు రమేశ్ నాయక్, నర్సింహ, మహేశ్, సురేశ్, వెంకటేశ్,శ్రీకాంత్, నాగార్జున, మల్లేశ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007-2008 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. ఇటీవల జంగారెడ్డిపల్లికి చెందిన తమ చిన్న స్నేహితుడు మీసాల మహేశ్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మహేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.29,500 మహేశ్ భార్య శిరీష, కుమారుడు రియాన్ష్‌లకు అందజేశారు. పరామర్శించిన వారిలో మహేశ్‌గౌడ్, మహిపాల్ గౌడ్, మీసాల మహేశ్, దరువుల మల్లేశ్, కాకి శ్రీశైలం, తదితరులున్నారు.


తలకొండపల్లి : ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

కందుకూరు : కొత్తూరుకు చెందిన సీహెచ్ లింగం 1997-98 విద్యాసంవత్సరంలో కందుకూరు ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ చదువుకున్నాడు. వృత్తిరీత్యా మహేశ్వరం మండల కేంద్రంలో (అల్మారి) వర్క్‌షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం పని ముగించుకొని ఇంటికి బైక్‌ను తిరిగి వస్తుండగా రాచులూరు గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిత్రులు లింగం ఇంటికెళ్లి రూ.45 వేలు ఇచ్చారు. బర్కం వెంకటేష్, సౌడ పు శేఖర్‌గౌడ్,ఎడ్ల వెంకటేష్‌ముదిరాజ్, జంగాచారి, కె.సుబాష్, ఎడ్ల మల్లేష్, ఆర్ రాంచంద్రి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మండల కేంద్రంలో మిత్రులు సరదాగా కలుసుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఓ మిత్రుడి వ్యవసాయక్షేత్రంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీహరి, వెంకటేష్‌గౌడ్, సందీప్, రవి, రమేష్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

బాధితులకు అండగా ప్రభుత్వం

ఆమనగల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బాధితులకు ప్రభుత్వంగా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. గతేడాది గుండాల గ్రామంలోని అంబరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్దగల కోనేరులో పడి మరణించిన పెరుమాళ్ల శివ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10లక్షలు మంజూరయ్యాయి. నగరంలోని ఆయన నివాసంలో శివ తల్లిదండ్రులు రాములు, లక్ష్మీలకు ఆదివారం ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. గుండాల దేవాలయ కమిటీ చైర్మన్ మల్లేపల్లి సందీప్ రెడ్డి, కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తిరుపతయ్య, అరుణ్, అంజయ్య, లింగమయ్య, అర్చకులు తదితరులున్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బాబయ్య

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రా మానికి చెందిన సంగెం ప్రభాకర్ తాను పరిశోధన చేసిన ప్రమోటర్ మోటీ ఫ్ ఎనాలసిస్ ఆఫ్ జీఎస్‌ఆర్‌హెచ్-1 ఇన్ బోనీ ఫిషెస్ అనే అంశంపై ప్రొఫెసర్ సెంథిల్ కుమార్ పర్యవేక్షణలో చేపలపై చేసిన పరిశోధన గ్రంథాన్ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సమర్పించారు. ఈమేరకు ఆదివారం దూసకల్‌కు వెళ్లిన బాబయ్య ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో ఆయన డాక్టరేట్‌ను అందుకోనున్నారని అభినందనలు తెలిపారు. వెంకటేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్‌కు చెందిన హమాలి కార్మికుడు శివగల్ల వెంకటయ్య ప్రమాదవశాత్తు చెయ్యి విరిగిపోయింది. ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జల్లెల్ల శ్రీశైలంయాదవ్ పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి రూ.5వేలు, శ్రీశైలం రూ.2వేలు సమకూర్చగా నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీటీసీ జోగు రమేశ్, రమేశ్, చెన్నయ్య, రామచంద్రయ్య, బషీర్, తిరుపతిగౌడ్, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి

నందిగామ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. నందిగామ పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం, పెద్దషాపూర్ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్(30) ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామం పెద్దషాపూర్ నుంచి భార్య శిరీషతో కలిసి నందిగామ మండలం నర్సప్పగూడకు వెళ్తున్నాడు. నందిగామ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పాతజాతీయ రహదారిపై షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి.. డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శిరీషకు తీవ్ర గాయాలవడంతో 108 అంబులెన్స్‌లో శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఉంచారు. కాగా, కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి..

కొత్తూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో రైలుకింద పడి సురేష్ దూబే(30) అనే వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. బిహార్‌కు చెందిన దూబే కొన్ని సంవత్సరాలుగా కుటుంబసభ్యులతో కలిసి కొత్తూర్‌లో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడని, శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈక్ర మంలో ఆదివారం ఉదయం కొత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై శవమై కనిపించాడని చెప్పారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ రహమత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ట్రైన్ ఢీకొని మరొకరు..

నందిగామ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలో రైల్వేట్రాక్‌పై ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, కడ్లాపూర్‌నకు చెందిన అంజయ్య(58) బహిర్భూమికి వెళ్లి ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతిచెందినట్లు రైల్వేపోలీస్ ఐజాక్ తెలిపారు. మృతుడి ప్యాంటులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు గుర్తించినట్లు తెలిపారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ ఉబేద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి


సాయికుమార్(ఫైల్)

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్‌గల్‌లో ఎనిమిది నెలల వ్యవధిలోనే తండ్రీ కుమారులు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. 8నెలల క్రితం తండ్రి రామాచారి వ్యాధిగ్రస్తుడై మరణించగా.. ఆయన కుమారుడు సాయకుమార్(23) జూలై 25న విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కాగా, అతడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జూలై 25న వెల్దండ సమీపంలోని విద్యుత్ స్తంభమెక్కి పనులు చేస్తుండగా ఈదురు గాలులకు ఎగిరిపడి 11కేవీ వైర్లపై పడిపోయాడు. దాంతో తీవ్రంగా గాయపడటంతో అతడి స్నేహితులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. సాయికుమార్ మరణంతో ఆ కుటుంబం వీధిన పడిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని కోరారు.

గుండెపోటుకు గురైన వాటర్‌మ్యాన్..


జంగయ్య(ఫైల్)

యాచారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాండ్లగూడ గ్రామానికి చెందిన వాటర్‌మ్యాన్ జంగయ్యకు గుండెపోటు రాగా.. ఆస్పత్రిలో చేరి ఆదివారం మరణించాడు. జంగయ్య(45)కు పది రోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబికులు నగరంలోని కామినేని ఆసుపత్రిలో చేర్పించి ఆపరేషన్ చేయించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. ఆయనకు భార్య జయమ్మ, ముగ్గురు కుమారులున్నారు. మృతుడి అంత్యక్రియలకు కార్యదర్శి తిరుపతి పంచాయతీ నిధుల నుంచి రూ.పది వేలు అందించారు. అంకితభావం గల పంచాయతీ ఉద్యోగిని కోల్పోయామని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మొయినాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన తిప్పరాజు సరోజ(48) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తరువాత ఆమె సరోజ కుమారుడు అరుణ్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న డబ్బు బాధితుడికి అప్పగింత

తలకొండపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీసీ ఫుటేజీ ఆధారంగా పోగొట్టుకున్న డబ్బులను పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితుడికి అందించారు. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మయ్య శనివారం తన పర్సులో రూ.16వేలతో వికాస్ బ్యాంకులో చెల్లించేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో బ్యాంకుకు చేరుకున్న ఆయనకు పర్సు కనిపించకపోవడంతో మార్గమధ్యలో ఎక్కడో పడిపోయిందనుకొని వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, శివుడు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి పర్సును తీసుకెళ్లినట్లు గుర్తించారు. బైక్ నెంబర్ ఆధారంగా వారిని గుర్తించి డబ్బును స్వాధీనం చేసుకొని బాధితుడికి అందించారు. దాంతో అతడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబులెన్స్‌లో మర్చిపోయిన సెల్‌ఫోన్..

కందుకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో సెల్‌ఫోన్ మరిచిపోయింది. అంబులెన్స్ సిబ్బంది నిజాయితీగా బాధితురాలికి అప్పగించారు. కందుకూరు గ్రామానికి చెందిన నందిగామ లక్ష్మమ్మ(75) ఆదివారం తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళుతున్న సమయంలో ఆమె సెల్‌ఫోన్ అంబులెన్స్‌లో మరిచి పోయింది. అంబులెన్స్ కందుకూరు చేరుకోగా సెల్‌ఫోన్ కనిపించింది. వెంటనే సిబ్బంది లక్ష్మమ్మ కుమారుడికి సమాచారమిచ్చి అందజేశారు.

ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేత

తలకొండపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఖానాపూర్ గ్రామానికి చెందిన శ్యామ్‌సుందర్ శర్మ ఇంటి నిర్మాణానికి తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఇంటి నిర్మాణం నిలిచిపోయిన శ్యామ్‌సుందర్ శర్మ తోడ్పాటు నందించాలని వెంకటేశ్‌ను కోరారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చారు. ఆదివారం ట్రస్ట్ సభ్యులు మెటీరియల్‌ను శ్యామ్‌సుందర్ శర్మకు అందజేశారు. నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి ట్రస్ట్ ద్వారా తోడ్పాటునందిస్తున్న వెంకటేశ్ ను పలువురు అభినందించారు. అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వెంకటేశ్ కోరారు.